క్లుప్తంగా

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

చాగల్లు: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ ఎస్.త్రిమూర్తులు అచ్యుతాచారి అన్నారు. స్థానిక సబ్‌స్టేషన్ వద్ద గురువారం రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఏఈ మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం గ్రామ సచివాలయల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతుల తమ ప్రతి మోటారుకు కెపాసిటర్ బిగించుకోవాలని కోరారు. విద్యుత్ వైర్ల కింద కొబ్బరి, పామాయిల్ తోటల్లో గెలలు కోసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల, ఇనుప గొట్టాలు వంటివి వాడకూడదన్నారు.

దొండపూడి వద్ద హైవే నిర్మాణానికి సర్వే

గోపాలపురం: దొండపూడి వద్ద హైవే నిర్మాణానికి గురువారం రోడ్డు విస్తరణకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. దొండపూడి సెంటర్‌లో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 23 మీటర్లు తొలగించాల్సి ఉండగా గ్రామస్తులు 18 మీటర్లకు కుదించాలంటూ జిల్లా ఉన్నతాధికారులను వేడుకోవడంతో హైవే అథారిటీ, మండల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ మేరకు సర్వే నిర్వహించినట్టు తహసీల్దార్ డి.వనజాక్షి తెలిపారు.

కోటసత్తెమ్మను దర్శించిన కొవ్వూరు డీఎస్పీ



డీఎస్పీ రామారావును సన్మానిస్తున్న ఈఓ నీలకంఠం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారిని కొవ్వూరు డీఎస్పీ సీహెచ్ రామారావు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) ఆధ్వర్యంలో డీఎస్పీకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై అప్పారావు, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పాల్గొన్నారు.


తాడిమళ్ల అభివృద్ధికి మరింత కృషి

నిడదవోలు రూరల్: తాడిమళ్ల గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడంతో తాడిమళ్లకు మంజూరైన రూ.20 లక్షల నిధులతో గ్రామంలో చేపట్టే సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, నాయకులు కాగిత లక్ష్మణరావు, కాపకాయల సూర్యనారాయణ, మానుకొండ చంద్రబాబు, బయ్యే లక్ష్మణరావు, తిరుమళ్ల దుర్గారావు పాల్గొన్నారు.

విద్యుత్ సేవలన్నీ గ్రామ సచివాలయాల్లోనే..

ఉండ్రాజవరం : విద్యుత్ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా అప్లికేషన్, బిల్లుల చెల్లింపు, రిజిస్ట్రేషన్ ఎస్టిమెంట్ పేమెంట్ వంటి సేవలు ఇకపై గ్రామ సచివాలయాల్లోనే లభిస్తాయని విద్యుత్ శాఖ డిప్యూటీ ఈఈ పి.శ్రీధర్ అన్నారు. ఏపీ ఈపీడీసీఎల్ పిలుపు మేరకు ఉండ్రాజవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం వినియోగదారులు, రైతులతో విద్యుత్ సదస్సు నిర్వహించారు. రైతుల విద్యుత్ వినియోగం పరిశీలన కోసం క్షేత్రస్థాయిలో మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈ దొరబాబు, జేఈ సుమన్, విద్యుత్ శాఖ సిబ్బంది, మండలంలోని రైతులు పాల్గొన్నారు.

రోబోటిక్‌పై వర్క్‌షాప్



వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాళ్లపూడి: విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టాలని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు గురువారం వరకు 3 రోజుల పాటు రోబోటిక్ వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో టిక్ టీం సొల్యూషన్స్, గుడివాడ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయిని దుర్గా భవాని ఆధ్వర్యంలో విద్యార్థులు రోబోటిక్‌ల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్విపింగ్ రోబోట్, పెట్, ఇండస్ట్రియల్ రోబోట్, సర్వింగ్, ట్రిక్కింగ్ రోబోట్ తదితర 8 రోబోట్స్‌ని తయారు చేశారు. వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ బాలమణి , ఉపాధ్యాయులు సుభాషిణి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎన్నికల విధుల నిర్వహణ

- ఈఆర్‌వో వెంకటరమణ నాయక్
- అధికారులు, సిబ్బందికి ఎన్నికల ప్రక్రియపై అవగాహన



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఈఆర్‌వో వెంకటరమణనాయక్



శిక్ష తరగతులకు హాజరైన ఎన్నికల నిర్వహణ సిబ్బంది

నిడదవోలు: ఎన్నికల విధులను విజయవంతంగా నిర్వహించాలని ఈఆర్‌వో ఆర్.వెంకటరమణ నాయక్ అన్నారు. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో గురువారం సార్వత్రిక ఎన్నికలు–2024 లకు సంబంధించి నిడదవోలు నియోజకవర్గస్థాయి సెక్టర్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎల్‌ఎంటీలు, బీఎల్‌వోలు, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లు, మండల సర్వేయర్లకు ఎన్నికల విధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా క్లైములు, అభ్యంతరాలను పరిశీలించి ఓటరు జాబితా సవరణలను పారదర్శకంగా చేపట్టాలని ఆయన ఆదేశించారు. 6, 7, 8 ఫాంలను పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మాక్ పోలింగ్ ఏ విధంగా నిర్వహించాలో, సమస్యలు వస్తే ఎలా స్పందించాలో, ఏం చేయాలో సిబ్బందికి ఆయన వివరించారు. బీఎల్‌వోలు, సెక్టోరల్ అధికారులు, సైపర్‌వైజర్ల విధులను సమర్థవంతవంగా ఎలా నిర్వహించాలో విసదీకరించారు. మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏ విధమైన ఇబ్బందులు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవసరమైన సదుపాయలను పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు ఉండ్రాజవరం, పెరవలి మండలాల తహసీల్దార్లు వి.నాగభూషణం, ఎ.నవీన్ బాబు, బి.సుధా, నిడదవోలు ఆర్ఐ సత్యేంద్ర, రెవెన్యూ, ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు: పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన లారీ డ్రైవర్ కట్టా సత్యనారాయణ (60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. డ్యూటీకి వెళ్లడం లేదని భార్య తరచుగా గొడవ పడుతూండటంతో ఆగ్రహించిన సత్యనారాయణ తను వాడుతున్న బీపీ, షుగర్ మందులు మోతాదుకు మించి వేసుకున్నాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చోడవరం గ్రామంలో విద్యుత్ లైన్లు ఏర్పాటు నిమిత్తం మూడు రోజులపాటు ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆపరేషన్ విభాగం నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు తెలిపారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉదయం 3 నుంచి 9 వరకూ, తిరిగి సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఇస్తామన్నారు.

వాటర్ ట్యాంకుల నిర్మాణానికి సానుకూల స్పందన

తాళ్లపూడి: మండలంలో శుద్ధి చేసిన తాగునీటి సరఫరాకు అదనంగా కొత్త వాటర్ ట్యాంకుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలనీ కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు విలేకరులకు ఫోన్‌లో తెలిపారు. అసెంబ్లీ సమావేశాలులో భాగంగా గురువారం ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా కలిసి కొవ్వూరు నియోజకవర్గంలోని మండలంలోని పలు సమస్యలను వివరించారన్నారు. ముఖ్యంగా 11 గ్రామ పంచాయతీలకు ప్రక్కిలంకలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న వాటర్ ప్లాంట్ ద్వారా గోదావరి నీటిని శుద్ధి చేసి తాగు నీటిని పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తున్నారని, గ్రామంలో వాటర్ ట్యాంకు అవసరమని ముఖ్యమంత్రి జగన్ దృష్టిలో పెట్టినట్ట తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని, నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తా అని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తలారి వెంకటరావు తెలిపారు.



సమస్యలను సీఎం జగన్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే, కొవ్వూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి

దేవదాయ భూముల కౌలు వేలం

గోపాలపురం: స్థానిక వేంకటేశ్వరస్వామి, పెరుమాళ్ల రెడ్డి సత్రం, సుబ్రహ్మణ్వేరసామి ఆలయాలకు సంబంధించిన భూములకు సంవత్సర కాలానికి కౌలు వేలం నిర్వహించినట్టు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఏ సుజన్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేలం ప్రక్రియ కొనసాగింది. వేంకటేశ్వరసామి ఆలయానికి సంబంధించి 54.12 ఎకరాలకు రూ.8,75,500, పెరుమాళ్లరెడ్డి సత్రానికి చెందిన 20.92 ఎకరాలకు గానూ రూ.2,38,500, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయానికి చెందిన 10.77 ఎకరాలకు రూ.1,12000లకు రైతులు వేలం దక్కించుకున్నారని సుజన్‌కుమార్ తెలిపారు. గత ఏడాది కంటే రూ.2లక్షలు అదనంగా దేవదాయ శాఖకు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. వేలం ప్రక్రియలో ఈఓ కె.నాగరాజు ఆయా దేవాలయాల అర్చకులు రైతులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేలం నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయి పోటీలకు దేవరపల్లి క్రీడాకారులు

- మహిళా క్రికెట్, ఖోఖో జట్ల ఎంపిక
- నేటి నుంచి ప్రారంభం

దేవరపల్లి: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో దేవరపల్లి క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విశాఖపట్నంలో ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు దేవరపల్లి మండలం నుంచి మహిళా క్రికెట్ జట్టు, పురుషుల ఖోఖో జట్టు ఎంపిక కాగా బుధవారం విశాఖపట్నం వెళ్లారు. దేవరపల్లి గ్రామ సచివాలయం–1 నుంచి మహిళా క్రికెట్ జట్టు, యర్నగూడెం గ్రామ సచివాలయం నుంచి ఖోఖో పురుషుల జట్టు ఎంపికైయింది. క్రీడాకారులు గ్రామ కార్యదర్శులు ఎస్. రవికిషోర్, రవికుమార్ ఆధ్వర్యంలో విశాఖపట్నం వెళ్లారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రెండు జట్లు ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ.5 లక్షలు నగదు సాధిస్తామని క్రీడాకారులు ధీమా వ్యక్తం చేశారు.



రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీలకు హాజరైన దేవరపల్లి క్రీడాకారులు

రైల్వే హాల్టుల పునరుద్ధరణ కోరుతూ రేపు పాదయాత్ర

కొవ్వూరు: స్థానిక రైల్వే స్టేషన్‌లో 2019 సంవత్సరానికి ముందు ఆగే 36 రైలు హాల్టులలో ఏకపక్షంగా నిలిపివేసిన 24 హాల్టులు పునరుద్ధరణ చేయాలని కోరుతూ రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా శనివారం పాదయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు కొవ్వూరు రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్, విజయవిహార్ మీదుగా లాంచీల రేవు, రోడ్ కం రైలు వంతెన మీదుగా రాజమహేంద్రవరంలోని కోటిపల్లి బస్టాండ్ మీదుగా ఎంపీ కార్యాలయం వరకూ ఈ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. రైలు హాల్టులు పునరుద్ధరణ కోరుతూ ఎంపీకి వినతిపత్రం అందజేయాలని పరిరక్షణ సమితి సభ్యులు నిర్ణయించారు. సామాజిక స్పృహతో స్థానిక ప్రజలంతా ఈ పాదయాత్రలో పాల్గొనాలని కోరారు. రైలు హాల్టులు పునరుద్ధరించేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. రానున్న రోజుల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు సమితి సభ్యులు తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా కబడ్డీ జట్టుకు అభినందన

నల్లజర్ల: ఆడుదాం ఆంధ్రాలో నియోజకవర్గంలో ప్రథమ, జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించిన మహిళల కబడ్డీ జట్టు సభ్యులను ఏకేఆర్జీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వట్టికూటి శివరామ్ గురువారం అభినందించారు. జట్టు సభ్యులు మద్య హ్నపు సరస్వతి, ఏనుగు భాగ్యశ్రీ, గంగాభవానీ, నిచ్చెనకోల కుసుమ, మెంతులపల్లి జ్యోతిదేవి, నున్న ప్రసన్నదేవి, ఊబలంక దివ్యసాయిలక్ష్మిలను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడలు నిర్వహిస్తోందని ప్రిన్సిపాల్ శివరామ్, చైర్మన్ చావా గోఖుల్ న్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం

నల్లజర్ల: మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గూడూరు సుబ్రహ్మణ్యాచార్యులు ఎన్నికయ్యారు. నల్లజర్లలో గురువారం జిల్లా అధ్యక్షుడిగా గెల్లా రాజు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షుడిగా పొట్టి వెంకటేశ్వరావు, గౌరవ సలహాదారుడిగా యజ్జవరపు గాంధీ, ఉపాధ్యక్షుడిగా కోనాలడేవిడ్, కార్యదర్శిగా బొట్టా వెంకటేశ్వరావు, సహాయ కార్యదర్శి కట్టా నతానియేలు, కోశాధికారి తొంటపాక వెంకటేశ్వరావు, సహాయకోశాధికారి ఓగ్గు నరేష్, పీఆర్‌ఓ తాడిగడప సిద్దూ, కార్యవర్గ సభ్యులుగా సుబ్రహ్మణ్యం, సెవెన్‌హిల్స్, సుబ్రహ్మణ్యం, మహేష్, శివ, ఏడుకొండలు ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లాల చైర్మన్ రాము ముఖ్యఅతిథిగా హాజరై ఫొటోగ్రాఫర్స్ విధివిధానాలు తెలియజేశారు.



నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

చాగల్లు: వచ్చే ఎన్నికల దృష్ట్యా చాగల్లు గ్రామంలోని 15 పోలింగ్ స్టేషన్లను ఎంపీడీఓ ఎస్.బుజ్జి, తహసీల్దార్ ఎం.సావిత్రమ్మ గురువారం పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వికలాంగులు సౌకర్యం కోసం పలు చోట్ల ర్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.



చాగల్లులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించం

డ్వామా పీడీ ముఖలింగం

నిడదవోలు రూరల్: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు పాల్పడితే ఉపేక్షించేదే లేదని డ్వామా పీడీ ముఖలింగం హెచ్చరించారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై ఎంపీడీఓ జేపీ రూనీస్ అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ ముఖలింగం మాట్లాడుతూ నిడదవోలు మండల పరిధిలోని 23 గ్రామాల్లో 2022–23 ఏడాదిలో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రూ.7.69 కోట్లతో చేపట్టిన 1650 పనులపై ఆడిట్ నిర్వహించగా రూ.11.49 లక్షల నిధుల మంజూరు లావాదేవీల్లో తేడాలు గుర్తించామన్నారు. పనుల్లో అవకతవకలు గుర్తించి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రూ.76 వేలు రికవరీ తోపాటు రూ.22 వేలు జరిమానా విధించారు. బిల్లుల మంజూరులో గుర్తించిన రూ.4.36 లక్షలపై విచారణకు ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ అప్పలరాజు, ఎస్ఆర్పీ తులసీనాయక్, ఏపీఓ రవి, ఉపాధిహామీ జేఇ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ ముఖలింగం, ఎంపీడీఓ జేపీ రూనీస్

పిల్లల ఆరోగ్యం కోసమే నులిపురుగుల నిర్మూలన

ఎంపీడీవో సుశీల

కొవ్వూరు: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ద్వారా ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు బాలలు, కిషోర్ యువత కచ్చితంగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని ఎంపీడీవో కె.సుశీల పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జాతీయ పురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు మాట్లాడుతూ శుక్రవారం ఒక్కొక్కరికి 400 గ్రాముల ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సులోపు వారందరికి ఈ మాత్రలు పంపిణీ అందజేయనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల ద్వారా ఉచితంగా మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీ మాత్రలు తీసుకోని వాళ్లకు 16వ తేదీన అందజేస్తామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 5,760 మంది ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారున్నారన్నారు. ఎంఈవో జె.కెంపురత్నం, సీడీపీవో డి.మమ్మీ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు ఎంపీడీవో కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

వ్యక్తి అనుమానాస్పద మృతి



పిల్లా వెంకటేశ్వరరావు

దేవరపల్లి: యాదవోలులోని జీడిమామిడి తోటలో రైతు పిల్లా వెంకటేశ్వరరావు(48) గురువారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పిల్లా వెంకటేశ్వరరావు ఉదయం 6 గంటలకు తన జీడిమామిడి తోటలోకి వెళ్లాడు. సాయంత్రం వరకూ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చెట్టుకు చేరబడి మృతి చెంది ఉన్నట్టు గుర్తించారు. దీనిపై మృతుడి కుమారుడు పిలకా సాయిరామ్ కృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు సీఐ కె.రామకృష్ణ, ఎస్సై కె.శ్రీహరిరావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

రేపు శతక పద్య సహస్ర గళధారణ

1008 మంది చిన్నారులతో 108 వేమన పద్యాల ఆలాపన

కొవ్వూరు: పెరవలికి చెందిన మాతృ భాషా పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9.30 గంటలకు పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో శత పద్య సహస్ర గళధారణ–వేమన శతకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు పరిసర ప్రాంతాల్లోని 40 పాఠశాలల నుంచి 1008 మంది చిన్నారులు 108 వేమన పద్యాలను రాగయుక్తంగా ఆలాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు భాషాభిమానులంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలుగు భాషా వైభవాన్ని చాటి చెప్పి వేలాది చిన్నారులలో నైతిక విలువలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వివరాల కోసం మల్లేశ్వరం జెడ్పీ హైస్కూలు హిందీ పండిట్ సీహెచ్‌వీఎస్ నాగభూషణం 94413 47769, 81067 87769 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

తాళ్లపూడి: మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాలకు 24 గంటల పాటు త్రీఫేస్ కరెంట్ సరఫరా చేసేందుకు ఆర్‌డీఎస్ స్కీం అమలు చేస్తున్నామని, ఆ దిశగా ఏపీఈపీ డీసీఎల్ చర్యలు చేపట్టిందని నిడదవోలు డీఈ వీరభద్రరావు తెలిపారు. ప్రక్కిలంక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గురువారం రైతులకు అందించే విద్యుత్ సేవలపై రైతులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. డీఈ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారానే విద్యుత్ కనెక్షన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కొత్తగా విద్యుత్ లైన్ కోసం అప్లై చేస్తే అక్కడ ఉన్న అవకాశాల బట్టి సర్వీసులు ఇస్తారన్నారు. కొవ్వూరు ఏడీఏ అచ్యుతాచారి మాట్లాడుతూ సర్వీసులు ఇవ్వడంలో ఆలస్యమవుతుందని విషయంపై ఆయా ప్రాంత జేఎల్ఎంలు బాధ్యులు అవుతారని సిబ్బందికి హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ వెజ్ బోర్డ్ సభ్యులు పుప్పాల వెంకటరావు, మండల ఏఈ సీహెచ్ వెంకటరావు, ఏవో జి.రుచిత, అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షులు పోసిన శ్రీ కృష్ణ దేవ రాయలు, రైతులు పాల్గొన్నారు.

దుకాణాలను రిజిస్ట్రేషన్ చేయించాలి

నిడదవోలు: కొవ్వూరు, నిడదవోలు డివిజన్లలో కార్మిక శాఖ పరిధిలో అన్ని దుకాణాలు, సంస్థలకు ఈనెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కొవ్వూరు సహాయ కార్మిక కమిషనర్ సీహెచ్ ఆలోచన, నిడదవోలు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఇ.శాంతరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం ప్రకారం దుకాణాలకు సంబంధించిన యాజమాన్యం మీసేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలతప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఇప్పటి వరకు లేకుంటే వెంటనే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవాలన్నారు.

జగనన్న పాల వెల్లువను సద్వినియోగం చేసుకోండి

పెరవలి: జగనన్న పాల వెల్లువ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ తెలిపారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్‌లు, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి మాట్లాడుతూ మండలానికి 20 కేంద్రాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈఓఆర్డీ సీహెచ్ వెంకటరమణ, పశువైద్యురాలు సల్మా, అమూల్యా కంపెనీ ప్రతినిధి పాల్గొన్నారు.

చాగల్లు: మండలములోని చిక్కాల, కలవలపల్లి, ఎస్.ముప్పవరం, చంద్రవరం, నెలటూరు సచివాలయాల్లో పాల వెల్లువ కేంద్రాలను ఈ నెల 21వ తేదీన ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.బుజ్జి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జగనన్న పాల వెల్లువపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

మట్టి ముసుగులో ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న కాకరపర్రు గ్రామస్తులు
- ఆందోళనతో పోలీసుల రంగ ప్రవేశం
- స్టేషన్‌కు 9 లారీల తరలింపు

పెరవలి: మట్టి తవ్వకాల ముసుగులో అక్రమంగా ఇసుక రవాణతో తమ పంట పొలాలు నాశనం అవుతాయని కాకరపర్రు గ్రామస్తులు ఆందోళన చేశారు. నిత్యం వందలాది లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో ఇబ్బంది పడుతున్నామని ఇసుల లారీలను అడ్డుకున్నారు. గురువారం తెల్లవారు జాము నుండి లారీలను వెళ్లకుండా ఏటిగట్టుపై టెంట్‌లు వేసి ఆందోళన చేపట్టారు. దీనితో పెరవలి ఎస్ఐ ఏజీఎస్ మూర్తి సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులకు సర్ది చెప్పారు. 9 లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామస్తులు ఆందోళను విరమించారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై మాట్లాడుతూ తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా లేవా అనేది కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చామని వారి వచ్చిన వెంటనే పరిశీలించి తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై మూర్తి